రేపు పాలకొండలో జాబ్‌మేళా

పాలకొండ, జూన్ 20 : పాలకొండ డిగ్రీ కళాశాలలో శనివారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఆర్.వహీదా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో టైర్స్, మొండెలైజ్ ఇండియా ఫుడ్ ప్రైవేటు లిమిటెడ్‌లో ఉద్యోగాలకు గాను ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 23 సంవత్సరాల లోపు వారు, డిప్లమో, బీటెక్, డిగ్రీ, ఇంటర్ విద్యార్హత కలిగిన యువతీ యువకులు అర్హులని తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు బయోడేటా, ఆధార్‌కార్డు, కేస్ట్ సర్టిఫికెట్, రెండు ఫొటోలతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 99088 27160 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.



పరేషన్‌కు చెక్!



- రేషన్‌కార్డుదారులకు నూతన ప్రభుత్వం తీపికబురు
- వచ్చేనెల నుంచి బియ్యంతో పాటు పంచదార, కందిపప్పు పంపిణీకి ఆదేశాలు
- జిల్లాలో 2.81 లక్షల మందికి లబ్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న 'మన్యం' వాసులు

(పాలకొండ, జూన్ 20)

జిల్లాలోని రేషన్‌కార్డుదారులకు టీడీపీ కూటమి ప్రభుత్వం తీపికబురు అందించింది. వచ్చే నెల నుంచి బియ్యంతో పాటు కందిపప్పు, పంచదార అందించాలని పౌరసరఫరాలశాఖకు ఆదేశాలు జారీచేసింది. దీంతో 'మన్యం'లో రేషన్ కార్డుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో పూర్తి స్థాయిలో కార్డుదారులకు సరుకులు అందేవి కావు. కొన్ని ప్రాంతాల్లో ఏడాదిగా కందిపప్పును ఇవ్వడం లేదు. మరికొన్ని చోట్ల పంచదార ఇవ్వడం మానేశారు. మొత్తంగా బియ్యం మినహా మరే ఇతర సరుకులు పంపిణీ చేయడం లేదు. దీంతో కార్డుదారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధానంగా బహిరంగ మార్కెట్లో అధిక ధరకు కందిపప్పును కొనుగోలు చేసుకోలేక నానా అవస్థలు పడ్డారు. అయితే విషయాన్ని తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రేషన్ కార్డుదారులకు విధిగా పంచదార, కందిపప్పు, బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు. దీంతో పౌరసరఫరాల అధికారులను రాష్ట్రస్థాయిలో కందిపప్పును కొనుగోలు చేసి ఎంఎల్ఎస్ పాయింట్లకు తరలించే చర్యలు చేపడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 2.81 లక్షల మంది రేషన్ కార్డుదారులున్నారు. వీరిలో ఏఏవై కార్డుదారులు 55 వేల మంది ఉన్నారు. వీరందరికీ జూలై నుంచి బియ్యంతో పాటు కందిపప్పు, పంచదారను పౌరసరఫరాల శాఖ రేషన్ డిపోల ద్వారా అందించనున్నారు. బహిరంగ మార్కెట్‌లో పంచదార, కందిపప్పు ధరలు ఆకాశన్నంటుకున్నాయి. ఈ నేపథ్యంలో టీడీపీ కూటమి అందుబాటు ధరల్లోనే వాటిని ప్రజలకు అందించనుంది. ఆరకేజీ పంచదార రూ. 17, ఏఏవై కార్డుదారులకు కిలో రూ.13.50, కందిపప్పును కిలో రూ. 67లకు అందించనున్నారు. ప్రతి నెలా సరాసరి ఐదు వేల మెట్రిక్ టన్నుల మేర బియ్యాన్ని పౌరసరఫరాల శాఖాధికారులు పంపిణీ చేస్తున్నారు. కాగా వచ్చేనెల 150 మెట్రిక్ టన్నుల పంచదార, 280 మెట్రిక్ టన్నుల కందిపప్పును సరఫరా చేసేందుకు సమాయత్తమవుతున్నారు. ఏదేమైనా నూతన ప్రభుత్వం నిర్ణయంతో జిల్లావాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ ఖర్చులు బాగా తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు.

కందిపప్పు, పంచదార అందిస్తాం..

జిల్లాలో రేషన్‌కార్డుదారులకు ప్రభుత్వం సబ్సిడీ ధరకు పంచదార, కందిపప్పు అందించాలని ఆదేశాలు జారీ చేసింది. స్టాక్ వచ్చిన వెంటనే అన్ని రేషన్ డిపోలకు వాటిని పంపిస్తాం. వచ్చేనెల నుంచి కార్డుదారులకు బియ్యంతో పాటు కందిపప్పు, పంచదార అందిస్తాం.


-శివ ప్రసాద్, డీఎస్‌వో, పార్వతీపురం మన్యం





పిడుగు టెన్షన్

- వర్షం పడితే
- ఉమ్మడి జిల్లా వాసుల్లో ఆందోళన



రాజాం రూరల్, జూన్ 20: ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెంటీగ్రేడు దాటితే తట్టుకోలేం. అలాంటిది పిడుగు పడితే పరిసర వాతావరణంలో కొన్నిక్షణాల పాటు 10వేల డిగ్రీల సెంటీగ్రేడు ఉష్ణం ఏర్పడుతుంది. దీనిని భరించడం సాధ్యమా... దురదృష్టవశాత్తూ ఉమ్మడి జిల్లాలో కొంతకాలంగా పిడుగుల వర్షం కురుస్తోంది. పిడుగుపాటుకు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. పశుసంతతి కూడా మృత్యుబారిన పడుతోంది. చిన్నపాటి మేఘాలు దిగినా వాతావరణం భీకరంగా మారిపోతోంది. వెంటనే ఈదురు గాలులు ఆపై ఉరుములు, మెరుపులు... అనంతరం పిడుగుల వాన... ఇదీ ఉమ్మడి జిల్లా వాసులకు గత కొన్నాళ్లుగా ఎదురవుతున్న చేదు అనుభవం. ఈ పరిస్థితి దాపురించడానికి మానవ తప్పిదమేనని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నా మానవ మనుగడలో ఎలాంటి మార్పులు రాకపోవడం బాధాకరం. వర్షం కురిసే సమయంలో కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే ప్రాణభయం ఉండదని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు.

ఎందుకిలా...

భూ ఉపరితలం నుంచి ఎంత ఎత్తులో మేఘాల మధ్య ఘర్షణ నెలకొన్నా పిడుగుల తీవ్రత ఒకేలా ఉంటుందని, గాలి పీడనంలో వ్యత్యాసాలు మేఘాల కదలికలపై ఆధారపడి ఉంటుందన్నది వాతావరణశాఖ నిపుణుల అభిప్రాయం. ● భూ ఉపరితలంలో 1.6 కిలోమీటర్ల నుంచి 13 కి.మీ. మధ్య ఎత్తులో మేఘాలు ఏర్పడతాయి. ● ఈ సమయంలో రెండు మేఘాల మధ్య ఘర్షణ నెలకొని అత్యధిక విద్యుదావేశం ఉద్భవిస్తుంది. ప్రకాశవంతమైన కాంతి, అధిక ధ్వని వెలువడతాయి. కాంతి వేగం ఎక్కువ కావడం వల్ల మెరుపు, ధ్వని వేగం తగ్గి పెద్దగా శబ్దం వస్తుంది. ● పిడుగు పడిన శబ్దం 24 కిలోమీటర్ల పరిధి వరకు వినిపిస్తుంది. ● పిడుగులు ఎలక్ట్రానిక్, విద్యుత్ పరికరాలను వేగంగా ఆకర్షిస్తాయి.

జాగ్రత్తలు తప్పనిసరి..

- వర్షంలో తప్పనిసరిగా ప్రయాణించాల్సి వస్తే విధిగా సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేయడం మేలు. లేకుంటే మనం ప్రయాణించే సమీపంలో పిడుగుపడినా ఎంతో కొంత ప్రభావం మనపై పడొచ్చు.
- వర్షం పడే సమయంలో తడిచి వెళ్లినా పర్వాలేదు కానీ పొడవైన తాటి, టేకు, కొబ్బరి, వేప తదితర చెట్ల కింద ఉండకూడదు.
- కార్లు తదితర వాహనాల్లో ప్రయాణించేవారు ప్రయాణాన్ని ఆపివేయడం మేలు.. కొనసాగించాల్సి వస్తే డోర్లు (అద్దాలు) అన్నీ మూసివేయాలి.
- ఇళ్లకు ఎత్తైన ప్రదేశంలో మెటల్‌రాడ్‌ను ఏర్పాటుచేయాలి. పిడుగు పడితే అది ఆకర్షించి నష్టాన్ని నివారిస్తుంది.

మలేరియా మందుల్లేవ్!

- ఆసుపత్రుల్లో వేధిస్తున్న ఇంజక్షన్ల కొరత
- నిధులు ఇవ్వని గత వైసీపీ ప్రభుత్వం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రోగులు

సీతంపేట, జూన్20: మన్యంలో రోజురోజుకూ మలేరియా కేసులు పెరుగుతున్నాయి. ఆసుపత్రులకు బాధితులు క్యూ కడుతున్నారు. అయితే అనేక ఆసుపత్రుల్లో మలేరియా నివారణ ఇంజక్షన్లు అందుబాటులో లేవు. దీంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. బయట మందుల షాపుల్లో కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. కొన్నిచోట్ల అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రి అభివృద్ధి నిధుల నుంచి మలేరియా ఇంజక్షన్లు కొనుగోలు చేసి రోగులకు అందిస్తున్నారు. గడిచిన రెండు నెలల్లో 150 వరకు మలేరియా కేసులు నమోదైనప్పటికీ.. ఆసుపత్రుల్లో ఇంజక్షన్ల కొరత నెలకొనడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పీహెచ్‌సీల్లో ఇలా..

సీతంపేట మండలంలో మర్రిపాడు, కుసిమి, దోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా కేసులు ఎక్కువగా నమోద వుతున్నాయి. అయితే ఆయా పీహెచ్‌సీల్లో మలేరియా నివారణ ఇంజక్షన్లు లేవు. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం వాటికి ఆసుపత్రి నిధులు మంజూరు చేయడం లేదు. వైద్య ఆరోగ్యశాఖ నుంచి కూడా అవి సరఫరా కావడం లేదు. దీంతో పీహెచ్‌సీలు ఇంజక్షన్లు కొనలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఆయా సిబ్బంది మలేరియా కేసులను సీతంపేట ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారు. వారితో చిన్నారులు కూడా ఉన్నారు. కాగా ఈ ఆసుపత్రిలో మే నేల నుంచి ఇప్పటివరకు 150 ఇంజక్షన్లను బయట కొనుగోలు చేసి రోగులకు వైద్యసేవలు అందించారు. దీనిపై నూతన ప్రభుత్వం, ఉన్నతాధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని ఏజెన్సీ వాసులు కోరుతున్నారు. ఈ విషయమై ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస రావును వివరణ కోరగా.. ప్రస్తుతం మలేరియా ఇంజక్షన్లు కొరత లేదన్నారు. ఆసుపత్రి నిధుల నుంచి కొనుగోలు చేస్తున్నామని, రోగులకు ఎటువంటి ఇబ్బంది లేదని ఆయన స్పష్టం చేశారు.





సీతంపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మలేరియా బాధితులు

నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

- తొలిసారిగా అడుగుపెట్టనున్న జిల్లా ఎమ్మెల్యేలు

పార్వతీపురం, జూన్ 20(ఆంధ్రజ్యోతి): శాసనసభ సమావేశాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. శుక్రవారం ఉదయం గం.9.46 నిమిషాలకు సభ కొలువు తీరనుంది. ఈ మేరకు గవర్నర్ అబ్దుల్ నజీర్ నోటిఫికేషన్ జారీ చేశారు. రెండు రోజులపాటు ఈ సమావేశాలు జరగనున్నాయి. తొలిరోజు కొత్తగా ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఈ నేపథ్యంలో జిల్లా నుంచి ఎన్నికైన పార్వతీపురం, సాలూరు, కురుపాం, పాలకొండ ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, గుమ్మిడి సంధ్యారాణి, తోయక జగదీశ్వరి, నిమ్మక జయకృష్ణలు అసెంబ్లీకి పయనమయ్యారు. వారంతా మొదటిసారిగా శాసన సభలో అడుగుపెట్టనున్నారు. మాజీ ఎమ్మెల్సీ గుమ్మిడి సంధ్యారాణి సాలూరు నుంచి మొదటిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికై.. ఇప్పటికే మహిళా శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. కాగా నేడు ఆమెతో పాటు జిల్లాలో మిగతా ముగ్గురు ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

పార్వతీపురం రైల్వేస్టేషన్ అభివృద్ధికి చర్యలు

- ఈస్టుకోస్టు రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ పన్‌వాల్

పార్వతీపురం టౌన్, జూన్ 20 : పార్వతీపురం రైల్వేస్టేషన్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ఈస్టుకోస్టు రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ పన్‌వాల్ తెలిపారు. గురువారం విశాఖ రైల్వే డివిజనల్ మేనేజర్ సౌరబ్ ప్రసాద్‌తో కలిసి పార్వతీపురం రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ.. అమృత్ భారత్ కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం రైల్వే స్టేషన్‌లో రూ. 128 కోట్లతో ఇక్కడ అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఇప్పటికే అన్ని ప్లాట్ ఫారమ్‌లకు ప్రయాణికులు వెళ్లేందుకు వీలుగా వంతెన నిర్మాణాలు చేపట్టామని వెల్లడించారు. ఆరు నెలల లోపుగా లిఫ్టులు, ఎస్కలేటర్ సదుపాయం కల్పిస్తామన్నారు.



రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న దృశ్యం

కాలం చెల్లిన.. నీటి పరీక్ష కిట్లు

- అనేకచోట్ల నిరుపయోగంగా మారిన వైనం
- ఏడాది గడుస్తున్నా.. కొత్తవి అందించని అధికారులు
- గత వైసీపీ సర్కారు నిర్లక్ష్యంతో ప్రజలకు తప్పని ఇబ్బందులు
- కలుషిత నీటితో తరచూ రోగాలపాలు
- నూతన ప్రభుత్వం స్పందించాలని విన్నపం

(కొమరాడ)

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో నీటి నాణ్యత పరీక్షించి ప్రజలకు సురక్షిత నీటిని సరఫరా చేయాలని కేంద్ర ప్రభుత్వం రెండున్నరేళ్ల కిందట ఆదేశించింది. ఈ మేరకు అన్ని పంచాయతీలకు నీటి పరీక్ష కిట్లును అందించింది. అయితే గత వైసీపీ సర్కారు నిర్లక్ష్యం కారణంగా అవి చాలా చోట్ల వినియోగానికి నోచుకోలేదు. దీంతో నీటి పరీక్ష కిట్లు నిరుపయోగంగా మారాయి. చాలా పంచాయతీల్లో వాడకుండా పక్కన పెట్టేశారు. వీటిలో ఉండే రసాయనాలు, ఔషధాలకు కాలం చెల్లింది. ఫలితంగా కలుషిత నీటినే గ్రామీణ ప్రాంత ప్రజలు తాగాల్సి వస్తోంది. వాస్తవంగా శుద్ధ జలం తాగకపోవడం వల్ల ప్రజలు సుమారు 200 రోగాలకు గురయ్యే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కాగా జిల్లాలో చెరువులు, కాలువల నీటిని వినియోగించి గ్రామాల్లో రక్షిత పథకాలు నిర్వహిస్తున్నారు. అయితే అనేక చోట్ల రక్షిత నీటి పథకాలు పరిశుభ్రతకు నోచుకోవడం లేదు. నీటి వనరులన్నీ కాలుష్యంగా మారడంతో స్వచ్ఛమైన నీరు ప్రజలకు అందడం లేదు. మరోవైపు కుళాయిల నుంచి కూడా కలుషిత జలం సరఫరా అవుతోంది. ఇక గిరి శిఖర గ్రామాల్లో ప్రజలకు కొండ వాగుల నుంచి నుంచే వచ్చే నీరే దిక్కవుతోంది. దీంతో జిల్లావాసులు డయేరియా, మలేరియా తదితర వ్యాధుల బారిన పడుతున్నారు.





పరీక్ష కిట్టులో పరికరాలు



నీటి పరీక్ష కిట్టు

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 451 గ్రామ పంచాయతీలకు గాను 312 సచివాలయాలను ఏర్పాటు చేశారు. రెండున్నరేళ్ల కిందట రూ. 1,292 విలువ చేసే నీటి పరీక్ష కిట్లును అందించారు. వీటిలో మల్టీ మీటరు, నీటి పరీక్ష పరికరం, నాణ్యత పరీక్షకు ఉపయోగించే రసాయనాలు ఉన్నాయి. వీటిలో రసాయనాలు, ఔషధాల గడువు 2021, మార్చి నుంచి 2023, జూన్ వరకు ఇచ్చారు. నీటి పరీక్షలను ఏ విధంగా చేపట్టాలన్నది గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ సహాయకులకు ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు. అయితే సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అనేకచోట్ల కిట్లు వినియోగానికి నోచుకోలేదు. మరోవైపు వాటి గడువు ముగిసి ఏడాది కావస్తున్నా.. ఇంతవరకు కొత్త కిట్లు అందుబాటులోకి రాలేదు.

- సచివాలయాల పరిధిలో ఇంజనీరింగ్ సహాయకుడు, కార్యదర్శులు నెలకు ఒకసారి పరీక్షలు నిర్వహించాలి. వారు గుర్తించిన అంశాలను వైద్య ఆరోగ్యశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలి. ఏదైనా లోపాలు బయటపడితే వెంటనే అక్కడ ప్రజలను అప్రమత్తం చేయాల్సి ఉంది. అయితే గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆ చర్యలేవీ తీసుకోలేదు. దీంతో ప్రజలకు సురక్షిత నీరు అందని పరిస్థితి. తరచూ రోగాల బారిన పడుతూ.. ఆసుపత్రులకు క్యూ కట్టాల్సి వస్తోంది. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.

వాటికి కాలం చెల్లింది..

నీటి పరీక్ష కిట్లు కాలం చెల్లింది. కొత్త కిట్లును తెప్పించేందుకు చర్యలు చేపడతాం. కొత్త కిట్లు అందించి పర్యవేక్షణ పెంచి పరీక్షలు పూర్తిస్థాయిలో జరిగేలా చూస్తాం.

-ప్రభాకర్‌రావు, ఈఈ, పార్వతీపురం మన్యం జిల్లా

పైడిమాంబ దేవస్థానానికి త్వరలో పాలక మండలి

విజయనగరం రూరల్: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడిమాంబ దేవస్థానానికి నూతన ట్రస్టు బోర్డు (పాలకవర్గ) నియామకానికి కసరత్తు జరుగుతోంది. దేవదాయశాఖ పరిధిలో వున్న ఈ ఆలయానికి సంబంధించి ప్రభుత్వ విధివిధానాలు అనుసరించి ఈ ట్రస్టు బోర్డు నియామకం జరుగుతుంది. మాన్సాస్ ఛైర్మన్, వంశపారంపర్య ధర్మకర్తగా అశోక్ గజపతిరాజు ఈ ట్రస్టుబోర్డుకి ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా నిబంధనల ప్రకారం అశోక్ గజపతిరాజు ఛైర్మన్‌గా ఉంటారు. వీరితో పాటు దేవస్థానం సిబ్బందిలో ఒకరు, అర్చకుడు, ఒక మహిళ, మరో ఏడుగురు ట్రస్టుబోర్డులో ఉంటారు. దేవదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాలతో దేవదాయశాఖాధికారులు జిల్లాల వారీగా దేవాల యాలు, ట్రస్టుబోర్డుల వివరాలను సేకరిస్తున్నారు. ఈ క్రమంలో పైడిమాంబ దేవస్థానానికి సంబంధించి కూడా వివరాలను దేవదాయ శాఖ సేకరించింది. వైసీపీ హయాంలో ఏర్పాటైన ట్రస్టుబోర్డు పదవీ కాలం 2024, జూన్‌తో ముగిసింది. ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం అనంతరం దీనిపై స్పష్టత రావొచ్చు.

పరిశ్రమల ఏర్పాటుకు కృషి

- మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం కలెక్టరేట్/ గజపతినగరం, జూన్20: రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుతోపాటు పెట్టుబడులు రప్పించడంలో ఎన్ఆర్ఐలను భాగస్వాములను చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. చిన్న మధ్య తరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత సంబంధాల శాఖ మంత్రిగా రాష్ట్ర సచివాలయంలోని ఐదో బ్లాక్‌లో గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తనకు మంత్రిగా అవకాశం ఇచ్చిన చంద్రబాబుకు ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి ఒక రోడ్ మ్యాప్ తయారు చేస్తున్నారన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేయాలని భావించే ఔత్సాహికులకు ఏప్రాంతంలో ఎటువంటి పరిశ్రమకు అనుకూలమైన వాతావరణం ఉంటుందనే అంశంపై తమశాఖ ద్వారా తగిన గైడ్‌లైన్స్ ఇస్తామన్నారు. గత ఐదేళ్లుగా మూత పడిన పరిశ్రమలను ఆదుకొని వాటికి మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌కు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు లలితకుమారి, అదితిగజపతిరాజు శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రిగా బాధ్యతలు చేపడుతున్న కొండపల్లి శ్రీనివాస్

రెండు ఫైళ్లపై తొలి సంతకం

మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ రాష్ట్రంలో ఇరవై ఆదర్శ మండలాలకు పది లక్షల రూపాయలు చొప్పున నిధులు మంజూరు చేస్తూ తొలి సంతకం చేశారు. అలాగే డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసేలా ఎస్సీ, ఎస్టీ ఎస్‌హెచ్‌జీలకు రూ.250 కోట్ల వడ్డీలేని రుణాలు మంజూరు చేస్తూ రెండో సంతకం చేశారు.

సీఐటీడీలో మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్

హైదరాబాద్-బాలానగర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్(సీఐటీడీ)- ఫుల్ టైం మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్(ఎంఈ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ సహకారంతో ఈ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నారు. కోర్సు వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఎంట్రెన్స్ ఎగ్జామ్, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. హైదరాబాద్ సీఐటీడీ క్యాంపస్‌లో ప్రతి సోమ, మంగళ, బుధ వారాల్లో ఉదయం తొమ్మిదిన్నర నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు; ఓయూ ఇంజనీరింగ్ కాలేజ్(మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్) క్యాంపస్‌లో ప్రతి గురు, శుక్ర, శని వారాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం అయిదున్నర వరకు తరగతులు నిర్వహిస్తారు. ఉస్మానియా యూనివర్సిటీ మాస్టర్స్ డిగ్రీని ప్రదానం చేస్తుంది.

స్పెషలైజేషన్‌లు

- మెకానికల్ క్యాడ్/క్యామ్
- టూల్ డిజైన్
- డిజైన్ ఫర్ మాన్యుఫాక్చర్
- మెకట్రానిక్స్

అర్హత: ఏఐసీటీఈ గుర్తింపు పొందిన కళాశాల నుంచి మెకానికల్ ఇంజనీరింగ్/ప్రొడక్షన్ ఇంజనీరింగ్/ మెకట్రానిక్స్ ఇంజనీరింగ్/ఆటొమొబైల్ ఇంజనీరింగ్/ఏరోనాటికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.

- **ప్రోగ్రామ్ ఫీజు:** రెగ్యులర్ అభ్యర్థులు సెమిస్టర్‌కు రూ.41,000; స్పాన్సర్డ్ అభ్యర్థులు సెమిస్టర్‌కు రూ.51,000 చెల్లించాల్సి ఉంటుంది. అటానమస్ ఫీజు కింద రూ.9,770; కాషన్ డిపాజిట్ కింద రూ.1,000 చెల్లించాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.750
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 12
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** జూలై 14
- **పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **వెబ్‌సైట్:** citdindia.org

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/BeB8vjvలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

నల్సార్‌లో సర్టిఫికేషన్ కోర్సు

హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లాకు చెందిన సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(సీడీఓఈ)- షార్ట్ టర్మ్ సర్టిఫికేషన్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇందులో ప్రధానాంశం 'సైబర్ క్రైమ్స్ ఇన్వెస్టిగేషన్ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్స్ యూజింగ్ ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్(ఓసింట్) టూల్స్ అండ్ టెక్నిక్స్'. ఈ కోర్సుకి సెంటర్ ఫర్ సైబర్ లాస్ అండ్ ఫోరెన్సిక్ సైన్సెస్ సహకారం అందిస్తోంది. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు, ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 70 సీట్లు ఉన్నాయి. నల్సార్ విద్యార్థుల కోసం 10 సీట్లు ప్రత్యేకించారు.

- **కోర్సు ఫీజు:** రూ.6000
- **ప్రోగ్రామ్ సెషన్స్:** జూలై 5 నుంచి 7 వరకు
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 4
- **వెబ్‌సైట్:** nalsar.ac.in



ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ గురువారం 'విశ్వంభర' చిత్రం సెట్స్‌లో చిరంజీవితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దుర్గేశ్‌ను చిరంజీవి శాలువా కప్పి సత్కరించారు. మంత్రిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నెరవేర్చడంలో దుర్గేశ్ విజయం సాధించాలని చిరంజీవి ఆకాంక్షించారు.



యాభై ఏళ్లుగా తెలుగు చిత్రపరిశ్రమకు ఎనలేని సేవ చేస్తూ, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి అధ్యక్షుడిగా సేవలు అందిస్తూ, హిందూపురం నుంచి మూడోసారి శాసనసభ్యుడిగా ఎన్నికైన నందమూరి బాలకృష్ణను తెలుగు చలనచిత్ర వాణిజ్యమండలి, తెలుగు నిర్మాతల మండలి, తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు కలసి అభినందించారు.

మూడు ప్రపంచాల మధ్య జరిగే కథ



ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్ వంటి టాప్ స్టార్స్ నటించిన సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ' ప్రమోషనల్ కంటెంట్ ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తికలిగిస్తోంది. అలాగే దర్శకుడు నాగ్ అశ్విన్ పాల్గొన్న 'ఎపిక్ జర్నీ ఎపిసోడ్ వన్' కుతూహలాన్ని మరింత పెంచింది. తాజాగా గురువారం రెండో ఎపిసోడ్‌ను విడుదల చేశారు. ఇందులో దర్శకుడు మాట్లాడుతూ 'మూడు ప్రపంచాల మధ్య జరిగే కథ ఇది. ఒక్కో వరల్డ్ నుంచి ఒక్కో థాట్ ప్రాసెస్‌తో ఫ్యూచరిస్టిక్‌గా బిల్డప్ చేశాం. ఇందులో కాశీ మొదటిది. ఈ ప్రపంచంలో కాశీనే చివరి సిటీ అయితే ఎలా ఉంటుందన్న ఆలోచనతో 'కల్కి' స్క్రిప్ట్ మొదలు పెట్టాం. కలియుగం చివరిలో గంగానది ఎండిపోయిన తర్వాత కాశీ ఎలా ఉంటుంది, నాగరికత ఏ విధంగా ఉంటుంది అనే ఊహతో ఆ సిటీని క్రియేట్ చేశాం. ఇండియన్ ఆర్కిటెక్చర్, వెహికిల్స్ కరెన్సీ.. ఇలా అన్ని విషయాల్లో ఫ్యూచరిస్టిక్‌గా ఆ సిటీని రూపొందించాం. కాశీ పైన పిరమిడ్ ఆకారంలో ఉండే స్ట్రక్చర్ ఉంటుంది. దాన్ని మేం కాంప్లెక్స్ అంటాం. భూమిపై లేని నేచర్, యానిమల్స్, ఫుడ్.. అక్కడ ఉంటాయి. ఇదో రకం స్వర్గం అనుకోవచ్చు. మూడో ప్రపంచం శంబల. కాశీకీ, కాంప్లెక్స్‌కూ సంబంధం లేని ప్రపంచం అది. అక్కడ ఉన్న వారు కాంప్లెక్స్‌లో ఉన్నవారిని ఛాలెంజ్ చేస్తుంటారు. కల్కి అవతారం శంబలలో పుడుతుందనే నమ్మకం మన శాస్త్రాల్లో ఉంది. ఈ మూడు ప్రపంచాలు ఒకదానితో మరొకటి కలగలుస్తూ 'కల్కి' కథ నడుస్తుంది' అన్నారు.

థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో...



వరుణ్ సందేశ్, మధులిక వారణాసి జంటగా నటిస్తున్న చిత్రం 'ద కానిస్టేబుల్'. ఆర్యన్‌సుభాన్ ఎస్.కే దర్శకత్వం వహిస్తుండగా, జగదీశ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ఇటీవలే పూర్తయింది. ఈ సందర్భంగా వరుణ్ సందేశ్ మాట్లాడుతూ "త్వరలోనే కానిస్టేబుల్ పాత్రతో.. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో మీ ముందుకు వస్తున్నాను" అని చెప్పారు. "అద్భుతమైన కథ, ఆకట్టుకునే కథనం కుదిరిన సినిమా ఇది" అని నిర్మాత జగదీశ్ అన్నారు. "ఈ సినిమాలో వరుణ్ సందేశ్ నట విశ్వరూపం చూస్తారు" అని దర్శకుడు ఆర్యన్ సుభాన్ ఎస్.కే అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: వర్రప్రసాద్, కెమెరామెన్: హజరత్ షేక్, సంగీతం: సుభాశ్‌ఆనంద్.



తెలుగు నిర్మాతల హిందీ చిత్రం

టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థలు మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బాలీవుడ్ ఎంట్రీకి సిద్ధమయ్యాయి. ఈ రెండు సంస్థలు కలసి సన్నీడియోల్ కథానాయకుడిగా ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, టి.జి విశ్వప్రసాద్ నిర్మాతలు. తెలుగు దర్శకుడు గోపీచంద్ మలినేని దర్శకత్వం వహిస్తున్నారు. డైరెక్టర్‌గా హిందీలో ఆయనకు ఇది తొలి చిత్రం. భారీ బడ్జెట్‌తో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని మేకర్స్ గురువారం లాంచ్ చేశారు. ఈ నెల 22 నుంచి రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించనున్నారు. సయామీ ఖేర్, రెజీనా కసాండ్రా కీలకపాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: ఎస్ థమన్, సినిమాటోగ్రఫీ: రిషి పంజాబీ.

సర్‌ప్రైజ్ ఇవ్వబోతున్నా



దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కించిన 'మగధీర' చిత్రంలో ప్రతినాయకుడిగా అందరినీ మెప్పించిన దేవ్‌గిల్.. ఆ తర్వాత వరుస సినిమాల్లో అవకాశాలు కొట్టేసి, అనేక సార్లు ప్రతినాయకుడి పాత్రలు పోషించారు. ప్రస్తుతం ఆయన లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'అహో విక్రమార్క'. 'మా అబ్బాయి', 'రంగుల రాట్నం' ఫేమ్ చిత్ర శుక్లా హీరోయిన్‌గా నటిస్తున్నారు. పేట త్రికోటి దర్శకత్వంలో ఆర్తి చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గురువారం సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దేవ్‌గిల్ మాట్లాడుతూ "నన్ను ఇంతవరకూ మీరందరూ విలన్ పాత్రల్లోనే చూశారు. కానీ మీ అందరికీ ఈ సినిమాతో నేను సర్‌ప్రైజ్ ఇవ్వబోతున్నాను" అని చెప్పారు. "టెక్నికల్‌గా ఈ చిత్రం అద్భుతంగా ఉంటుంది" అని దేవ్‌గిల్ భార్య నిర్మాత ఆర్తి అన్నారు. "మంచి సినిమా చేశాం. ప్రేక్షకులందరూ ఈ సినిమాను ఆదరించాలి" అని దర్శకుడు పేట త్రికోటి కోరారు.

సేవాభావంతో రెవెన్యూ ఉద్యోగులు పని చేయాలి

● ఘనంగా రెవెన్యూ ఉద్యోగుల దినోత్సవం

కలెక్టరేట్, జూన్ 20: పనిలో ఎంతో ఒత్తిడి ఉంటుందని, దీనికి గురికాకుండా రెవెన్యూ ఉద్యోగులు సేవాభావంతో పని చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి అనిత అన్నారు. కొత్తగా రెవెన్యూ దినోత్సవం కార్యక్రమానికి ప్రభుత్వం జీవో ఇవ్వడంతో గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా రెవెన్యూ ఉద్యోగుల ఆధ్వర్యంలో రెవెన్యూ దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఆర్వో అనిత మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా వివిధ పథకాలు అమలులో భాగంగా లక్ష్యాలు నేరవేర్చడానికి ఉద్యోగులపై పని భారం ఉంటుందని అందుకు ఉద్యోగులు ఒత్తిడికి గురికాకుండా విధులు నిర్వహించాలన్నారు. సీనియర్ ఉద్యోగులను జూనియర్ల గౌరవించడం నేర్చుకోవాలని సూచించారు. దీనికి ముందు విశ్రాంత తహసీల్దార్ పేడాడ జనార్ధనరావు మాట్లాడుతూ విజయనగరం రూరల్; అర్బన్ తహశీల్దార్లుగా విభజన చేయాలని కోరారు. అనంతరం విశ్రాంతి రెవెన్యూ ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపకలెక్టర్లు, రెవెన్యూ ఉద్యోగులు ఉన్నారు.

● **పార్వతీపురం, ఆంధ్రజ్యోతి:** రెవెన్యూ డే వేడుకలు గురువారం కలెక్టర్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికలు, ప్రకృతి వైపరీత్యాలు తదితర అంశాల్లో రెవెన్యూ శాఖ ప్రాముఖ్యం చాలా ఉంటుందన్నారు. ఈ కార్య క్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి వేణుగోపాలరావు, ఈఎఫ్‌జి-సెక్షన్ సూపరింటెండెంట్ చిన్న కృష్ణ, డీ సెక్షన్ సూపరింటెండెంట్ ఆవాల సూర్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ చం ద్రమౌళి, షేక్ ఇ బ్రహీం, జిల్లా వీఆర్వోల అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

● **బొబ్బిలి:** రెవెన్యూడేని పురస్క రించుకుని గురువారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో వేడుక లు జరుపుకున్నారు. తహసీల్దారు త్రినాథ రావునాయుడు కేక్ కట్ చేసి రెవెన్యూ అధికారులకు, సిబ్బందికి తినిపించారు. అధికారులు, ఉద్యోగులు పరస్పరం శుభా కాంక్షలు తెలుపుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్లు శ్రీనివాస్, రెడ్డి సాయికృష్ణ, ఆర్ఐ కల్యాణచక్రవర్తి, సర్వేయర్, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు. ● **వీరఘట్టం:** మండలంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గురు వారం రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.జయప్రకాష్ మాట్లాడారు. గతంలో వీఆర్వోగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన ఉదయాన రామ్మూర్తినాయుడును సన్మానించారు. ఎంఆర్ఐ లక్ష్మణ్‌నాయుడు, వీఆర్వోలు, వీఆర్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు. ● **గరుగుబిల్లి:** గ్రామాల్లోని రెవెన్యూ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తహసీల్దార్ కె.జయ సూచించారు. రావుపల్లి గ్రామంలో గురువారం రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. అనంతరం రెవెన్యూశాఖకు చెందిన విశ్రాంత ఉద్యోగులు ముదిలి సత్యనారాయణ, అలజంగి గౌరునాయుడు, తెంటు భీముడు, సుబ్రహ్మణ్యం, బాలబాబులను సన్మానించారు. ఉప తహసీల్దార్ పి.సత్యలక్ష్మికుమార్, ఆర్ఐ మండంగి కృష్ణ, వీఆర్వోలు శ్రీనివాసరావు, నాగరాజు, ఎం.తవిటినాయుడు, సర్పంచ్ బి.మహేశ్వరరావు పాల్గొన్నారు. ● **సీతంపేట:** ప్రతి ఒక్కరికీ పూర్తిస్థాయిలో రెవెన్యూ సేవలు అందిస్తామని తహసీల్దార్ ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు.


కలెక్టరేట్ మాట్లాడుతున్న విజయనగరం డీఆర్వో


పార్వతీపురం: మాట్లాడుతున్న డీఆర్వో

గురువారం గొయిది గ్రామంలో రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. ఐటీడీఏ నియోకవర్గ కో-ఆర్డినేటర్ హిమరిక పవన్ మాట్లాడుతూ గిరిజనులు రెవెన్యూకు సంబంధించి ఏ పనిమీద వచ్చినా 24 గంటల్లో పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. ఎంపీడీవో గీతాంజలి, సర్పంచ్ సవర సిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు. ● **భామిని:** రెవెన్యూ శాఖ ప్రజలకు నిరంతర సేవలు అందిస్తుందని తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం రెవెన్యూ దినోత్సవం సందర్భంగా సింగిడి కల్యాణ మండపంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పదవీ విరమణ చేసిన గెల్లంకి దాసునాయుడుకు సన్మానించారు. డిప్యూటీ తహసీల్దార్ శేఖరన్, సర్వేయర్ రాజేశ్వరరావు, ఆర్‌డీటీ రమేష్, ఆర్ఐ రాంబాబు, స్థానికులు ఎస్.రామారావు, సిబ్బంది, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ● **మక్కువ:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉప తహసీల్దార్ గేదెల హేమలత ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఫైర్ కానిస్టేబుల్ ఆత్మహత్య


కిషోర్ (ఫైల్)

సీతానగరం, జూన్ 20: వ్యక్తిగత కారణాలతో ఫైర్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, ఎస్ఐ ఎం రాజేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చినభోగిల గ్రామానికి చెందిన గుడిమెట్ల కిషోర్‌కుమార్(33) పార్వతీపురంలోని అగ్నిమాపక దళంలో ఫైర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా కుటుంబకలహాలు, అప్పుల బాధతో ఇబ్బందిపడుతున్న కిషోర్ మనస్తాపం చెంది బుధవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకున్నారు. కొద్దిసేపటి తరువాత భార్య సంధ్య గమనించి చుట్టుపక్కల వారిని పిలిచి పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మరణించారు. మృతుని భార్య తెర్లాం కేజీబీవీలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. వీరికి ఒక పాప, బాబు ఉన్నారు. చినభోగిల గ్రామానికి చెందిన కిషోర్‌కు తల్లి, ఇద్దరు అన్నయ్యలు, అక్క ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. మృతదేహానికి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి


మజ్జి కృష్ణ (ఫైల్)

బొండపల్లి, జూన్ 20: మండలంలోని రయింద్రాం జంక్షన్ సమీపంలోని మామిడి తోటలో ఒక వ్యక్తి మృతదేహం గుర్తించారు. దీనికి సంబంధించి స్థానిక ఎస్సై కె.లక్ష్మణరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గజపతినగరం మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన మజ్జి కృష్ణ(32) గ్రామంలో వంట మాస్టార్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 17న ఇంటినుంచి బయటకు వెళ్లి, మూడు రోజులు కావస్తున్నా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అనుమానంతో తమ బంధువులను ఆరా తీసినప్పటికీ ఫలితం కానరాలేదు. ఈ క్రమంలో గురువారం బొండపల్లి మండలం రయింద్రాం జంక్షన్ వద్ద ఒక మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు ఆరా తీయగా మజ్జి కృష్ణగా గ్రామస్థులు గుర్తించారు. కృష్ణ భార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతి చెంది మూడు రోజులు కావడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో రాత్రి సమయం కావడంతో శవపంచనామా శుక్రవారం జరపునున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఒక పాప, బాబు ఉన్నారు.

భార్యపై హత్యాయత్నం.. భర్త అరెస్టు

కొత్తవలస, జూన్ 20: భార్యను వేధించడమే కాకుండా హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేసిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి కొత్తవలస ఎస్ఐ సుదర్శన రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తవలస డ్రైవర్స్ కాలనీలో నివాసం ఉంటున్న పెట్ల సన్యాశిరావు గ్వాలియర్‌లో సైనికునిగా పనిచేసి 2006 పదవీ విరమణ చేశాడు. ఆ తరువాత ప్రమీల అనే మహిళను వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు పుట్టిన తరువాత తరుచూ భార్యను వేధించడం మొదలు పెట్టాడు. గత నెల 30న భార్యను వేధించడమే కాకుండా హత్యాయత్నానికి ప్రయత్నించాడు. దీంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసు స్టేషన్‌లో పలుమార్లు భార్య భర్తకు కౌన్సెలింగ్ ఇచ్చినప్పటికీ భర్త ప్రవర్తనలో ఎటువంటి మార్పు రాకపోవడంతో కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామని, 14 రోజుల పాటు జుడీషియల్ కస్టడీలో ఉంచాల్సిందిగా న్యాయాధికారి ఆదేశాలు జారీ చేశారని ఎస్ఐ తెలిపారు.

పాము కాటుతో మహిళ మృతి

గుర్ల, జూన్ 20: మండలంలోని నడుపూరు గ్రామానికి చెందిన కర్రోతు కళావతి (39) పాముకాటుతో మృతి చెందింది. కళావతి గురువారం మధ్యాహ్నం పశుగ్రాసం కోసం గ్రామంలో గడ్డికోసేందుకు వెళ్లగా పాము కాటువేసింది. వెంటనే సహచరులు విజయనగరం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందింది. మృతురాలికి భర్త అక్కునాయుడు, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

కొత్తవలస, జూన్ 20: మండలంలోని తుమ్మికాపల్లి సమీపంలోని గేట్ వద్ద రైలు పట్టాలపై బుధవారం రాత్రి గుర్తు తెలియని మృతదేహం కనిపించిందని విజయనగరానికి చెందిన రైల్వే ఎస్ఐ రవి వర్మ తెలిపారు. మృతుని వయస్సు సుమారు 60 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. రైలులో నుంచి జారిపడ్డం కారణంగానే మృతి చెంది ఉండొచ్చునని తెలిపారు. మృతుని సమాచారం తెలిసినట్టయితే విజయనగరం, కొత్తవలస పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

వీధికుక్కల దాడిలో చిన్నారులకు గాయాలు

రాజాం: వీధి కుక్కల దాడిలో చిన్నారులకు తీవ్రగాయాలైన ఘటన రాజాం పట్టణంలో చోటుచేసుకుంది. గురువారం కాలేజీవీధిలో వీధి కుక్కలు దాడిలో చిన్నారులు కనకం వైష్ణవి, రమా గాయపడ్డారు. గాయపడిన చిన్నారులను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు వారికి ప్రథమ చికిత్స అందించారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల సీజ్

సీతానగరం: మండలంలోని బూర్జ, డి శిర్లాం రేవులనుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న ఎస్ఐ ఎం.రాజేష్, సిబ్బందితో కలిసి వెళ్ళి ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యుత్ వైర్ల చోరీకి విఫలయత్నం

రేగిడి: తునివాడ గ్రామ సమీపంలో బుధవారం అర్థరాత్రి 32కేవీ లైన్‌కు సంబంధించి విద్యుత్ వైర్ల చోరీకి గుర్తు తెలియని వ్యక్తులు విఫలయత్నం చేశారు. ఆ సమయంలో గ్రామస్తులు అప్రమత్తం కావడంతో పరారయ్యారు. రెండు స్తంభాల మధ్య దాదాపు 360 మీటర్ల అల్యూమినియం (విద్యుత్ కండక్టర్) వైరు విడిచిపెట్టి వెళ్లిపోయారు. ఈ ఘటనపై ఏఈ హరిబాబు ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

నేడు యోగా దినోత్సవం

విజయనగరం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేకంగా యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. విజయనగరం పట్టణంలోని రాజీవ్ క్రీడా మైదానంలో శుక్రవారం ఉదయం 7 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. స్వీయ మరియు సమాజం కోసం యోగా అనే అంశాన్ని తీసుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నిర్ణయించారు. కంటోన్మెంట్‌లోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటలకు యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సెట్విజ్ అధికారులు తెలిపారు. రాజీవ్ క్రీడా మైదానం యోగా కార్యక్రమాల్లో కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ కార్తీక్, డీఈఓ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొంటారు. ● **బొబ్బిలి:** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం 6.30 గంటలకు స్థానిక సంస్థానం హైస్కూలు మైదానంలో జరగను న్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఆర్ఎస్ఎస్ సంఘచాలక్ పెంటస్వామినాయుడు, చెలికాని కేశవ, రమేష్ పిలుపునిచ్చారు. పట్టణానికి చెంది న ప్రముఖ యోగా గురువులందరి సహకారంతో నిర్వహించనున్న ఈ కార్య క్రమంలో అందరూ పాల్గొనాలన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగ సాధ న ప్రాముఖ్యతను ప్రపంచమంతా గుర్తించిందని, ఇదిభారత దేశానికి ఎంతో గర్వకారణమన్నారు. ఆర్ఎస్ఎస్ నగర కార్యవాహ ఎస్ఎస్ఎం రమేష్, యోగా గురువులు ఎంఈఎస్ ప్రసాద్, మామిడి అప్పారావు, కోరాడ వెంకటరాజు, చం ద్రమౌళి, వంగపండు శ్రీరాములు, శీర సన్యాసినాయుడు, శంబంగి శ్రీను, సత్య, నళిని తదితరులు పాల్గొని యోగవిద్యపై సందేశాలతో పాటు ప్రదర్శనలు ఇస్తార ని తెలిపారు.

మలేరియా మందులు అందుబాటులో ఉంచండి

గుమ్మలక్ష్మీపురం: గిరిజన ప్రాంత ఆసుపత్రుల్లో మలేరియా సహా అన్ని రకాల వ్యాధులకు మందులు అందుబాటులో ఉంచాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ కోరారు. ఈ మేరకు పార్వతీపురం ఐటీడీఏ పీవో విష్ణుచరణ్‌కు గురువారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల భద్రగిరి సీహెచ్‌సీ లో మలేరియా వైద్యం కోసం వెళ్లిన గిరిజన విద్యార్థులకు మందులు లేవని వైద్య సిబ్బంది చెప్పడం ఆందోళన కలిగించిన విషయమన్నారు. ఇటువంటి పరిస్థితి లేకుండా చూడాలని కోరారు. గిరిజన సక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులను నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. పార్వతీపురం ఐటీడీఏలో రెగ్యులర్ రైజ్ అయిన సీఆర్టీల్లో పురుష ఉపాధ్యాయులు 16 మందిని బాలికల పాఠశాలల్లో నియమ నిబంధనలకు విరుద్ధంగా నియమించారని చెప్పారు. ఈ నియామకాలను రద్దు చేయాలన్నారు. బాలికల పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు.

నేడు జీఎంఆర్ ఐటీ స్నాతకోత్సవం

రాజాం: స్థానిక జీఎంఆర్ ఐటీలో 9వ స్నాతకోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు.

రూరల్ సీఐకి ఎస్పీ ప్రశంసా పత్రం

రాజాం రూరల్: రూరల్ సీఐగా పనిచేస్తున్న ఎస్ శ్రీనివాస్‌రావుకు జిల్లా ఎస్పీ ఎం.దీపిక ప్రశంసా పత్రం గురువారం అందజేశారు. ఎన్నికల విధులను సమ ర్థంగా నిర్వహించిన శ్రీనివాసరావును ఎస్పీ కార్యాలయంలో అభినందించారు.

నగరపాలక సంస్థలో 16 మంది బదిలీ

విజయనగరం రింగురోడ్డు: విజయనగరం నగరపాలక సంస్థలో ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేస్తున్నట్టు బుధవారం నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు ఉత్తర్వులు విడుదల చేశారు. అయితే ఈ విషయాన్ని గోప్యంగా ఉంచడం పలు విమర్శలకు తావిస్తోంది. ఈ బదిలీల విషయమై స్థానిక ఎమ్మెల్యే అదితీకి, మేయర్‌కు సైతం సమాచారం లేకపోవడం ఆశ్చర్యకరం. ఉత్తర్వుల్లో పేర్కొన్నట్టు పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా విధుల్లో మార్పులు చేశామని, అంతకుమించి ఏమీ లేదని కమిషనర్ నాయుడు ఆంధ్రజ్యోతికి తెలిపారు.

మంత్రులు అభివృద్ధికి కృషి చేయాలి

విజయనగరం దాసన్నపేట: ఉమ్మడి జిల్లా నుంచి మంత్రులుగా బాధ్యతలు స్వీకరించిన కొండపల్లి శ్రీనివాస్, గుమ్మడి సంధ్యారాణిలకు జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. మంత్రులు ఇద్దరూ ఉమ్మడి జిల్లా అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని కోరారు. జడ్పీ తరుపున వారికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. జిల్లా పరిషత్ అభివృద్ధికి తమ వంతు సహాయ, సహకారాలు అందించాలని కోరారు.

పారిశుధ్య నిర్వహణపై పర్యవేక్షణ

విజయనగరం రింగురోడ్డు: పారిశుధ్య నిర్వహణ పట్ల నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు, కార్యదర్శులకు నగర పాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు ఆదేశించారు. గురువారం ఉదయం స్థానిక 11వ డివిజన్‌లో పారిశుధ్య నిర్వహణ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఘోషాసుపత్రి, అశోక్‌నగర్, బూడివీధి తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఆ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో సంబంధిత పర్యవేక్షకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.. డస్ట్‌బిన్‌లు తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. చెత్తబుట్టలు వినియోగించేలా ప్రజలకు అవగాహన పెంచాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజాం: శ్రీకాకుళం, పాలకొండ రోడ్డులో వివిధ ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ జి.సురేష్‌బాబు, ఏఈ కూమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం రోడ్డులో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా అంతకాపల్లి, మొగులివలస, వాసవీ నగర్ కాలనీ, ఎల్‌సీ కాలనీ, శ్రీకాకుళం రోడ్డు, బుచ్చింపేట, పొనుగిటివలస, మారుతీనగర్ కాలనీ, డోలపేట, ఈశ్వరనారాయణ కాలనీ, బాబానగర్, పాలకొండ రోడ్డులో మొత్తం సరఫరా ఉండదన్నారు. పరిశ్రమల యజమానులు, గృహ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వేపాడ ఏపీఎం సస్పెన్షన్

విజయనగరం (ఆంధ్రజ్యోతి): వెలుగు విభాగంలో అనేక అవకతవకలు జరిగాయి. ఏసీ, ఏపీఎం, సీసీ, వీఓఏ తదితర సిబ్బంది చేతివాటం ప్రదర్శించారు. స్త్రీనిధి, ఉన్నతి, బ్యాంకు లింకేజీ, సామాజిక పెట్టుబడి నిధి తదితర వాటి ద్వారా స్వయం సంఘాల మహిళలకు ఇస్తున్న రుణాల మంజూరులో కమీషన్లు తీసుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. కొత్త ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా ఎస్.కోట క్లస్టర్ పరిధిలోని వేపాడ ఏపీఎంను సస్పెండ్ చేసింది. గత ఏడాది ఆయన రూ.13 లక్షలు పక్కదారి పట్టించినట్టు అధికారులకు ఫిర్యాదు అందింది. ఇటీవల సామాజిక ఆడిట్‌లో ఇది నిజమేనని తేలడం.. విచారణలో విషయం బయట పడడంతో సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశామని డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

రేపు దత్తజ్ఞాన బోధ సభ

రేగిడి: రేగిడి దత్తపీఠంలో ఈనెల 22న దత్తజ్ఞాన బోధ సభ నిర్వహిస్తున్నట్లు స్థానిక దత్తపీఠం అధ్యక్షులు కిమిడి సత్యనారాయణ తెలిపారు. పాలకొండకు చెందిన సత్యసాయి కమిటీ ప్రతినిధి ఎన్‌వీ రమణ అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశంలో రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ పి.స్వప్న హైందవి పాల్గొంటారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొబ్బిలి: బొబ్బిలి డివిజన్ పరిధిలో 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి 33 కేవీ జయలక్ష్మి ఇండస్ట్రియల్ ఫీడరు, 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడరు, హెరిటేజ్ ఫీడర్స్ పక్కనున్న చెట్ల కొమ్మలు తొలగించే పనుల కోసం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుతామని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆవాల అనంతరావు తెలిపారు. గ్రోత్‌సెంటరు పరిశ్రమలకు, పిరిడి సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 11 కేవీ అలజంగి, వెలగవలస ఫీడర్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

అక్కడే తరగతులు నిర్వహించండి

బాడంగి: ఎరుకుల పాకలు గ్రామంలో అక్కడి పిల్లలు చదువుకునేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు. గ్రామంలోని ఎంపీపీ స్కూల్ విద్యార్థులను గత వైసీపీ ప్రభుత్వం కక్ష కట్టి పక్క గ్రామమైన గజరాయనివలస యూపీ స్కూల్‌కు పంపించిందని రాష్ట్ర టీడీపీ ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎరుకుల పాకలు వద్ద ప్రమాదకరమైన రోడ్డు మలుపు ఉందని... ఇక్కడ చాలా రోడ్డు ప్రమాదాలలో మరణాలు సంభవించాయన్నారు. అదే రోడ్డు మీదుగా విద్యార్థులను గజరాయనివలస యుపీ స్కూల్‌కు పంపించడానికి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు. 5వ తరగతి వరకు ఎరుకులపాకల గ్రామంలోని ఎంపీపీ స్కూల్‌లో చదువుకునేలా అవకాశం కల్పించాలని అధికారులను ఆయన కోరారు.

'నీట్' ఫలితాలపై విచారణ చేపట్టాలి

● గాంధీవిగ్రహం ముందు ఏఐఎస్‌ఎఫ్ నిరసన

బొబ్బిలి, జూన్ 20: నీట్ పరీక్షా ఫలితాల్లో జరిగిన అవకతవకలపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో గురువారం గాంధీవిగ్రహం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఏఐఎస్‌ఎఫ్ కార్యదర్శి ఎన్.నాగభూషణం మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) విడుదల చేసిన నీట్ ఫలితాల్లో దేశవ్యాప్తంగా 67 మందికి నూరు శాతం మార్కులు రావడం, వారంతా హర్యానాలోని ఒకే పరీక్షాకేంద్రానికి చెందిన వారు కావడంతో ఇందులో అవకతవకలు జరిగినట్లు పెద్దఎత్తున దుమారం రేగుతోంది. రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని దెబ్బతీసే నీట్ పరీక్షా విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని దక్షిణాది ముఖ్యమంత్రులంతా డిమాండ్ చేస్తున్నారన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించి నిజాయితీ, ప్రతిభ కలిగిన విద్యార్థులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇందుకోసం ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. ఈ డిమాండ్‌పై విద్యార్థులంతా నినాదాలు చేశారు. ఏఐఎస్‌ఎఫ్ డివిజన్ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, ప్రవీణ్, వంశీ, సత్యనారాయణ పాల్గొన్నారు.



బొబ్బిలిలో గాంధీబొమ్మ ముందు ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన చేస్తున్న విద్యార్థులు

బొబ్బిలిలో ఈస్టకోస్ట్ రైల్వే జనరల్‌మేనేజర్

బొబ్బిలి, జూన్ 20: ఈస్టుకోస్టు రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ గురువారం బొబ్బిలి రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. విజయనగరం-రాయగడ-కొరాపుట్ సెక్షన్లను ఆయన తనిఖీ చేశారు. ట్రాఫిక్ ఫెసిలిటీ పనులను పరిశీలించారు. మౌళిక సదుపాయాల కల్పన ప్రాజెక్టు పనులను సమీక్షించారు. పలు అభివృద్ధి పనులకు సంబంధించి సూచనలు చేశారు. ప్రయాణికుల సౌకర్యాలు, వన్ స్టేషన్-వన్ ప్రొడక్టు స్టాల్స్, విశ్రాంతి భవనాలు, ఫుట్‌వేర్ బ్రిడ్జెస్‌ను పరిశీలించారు. వెండార్స్‌తో మాట్లాడారు. ఆయన వెంట డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, చీఫ్ ట్రాక్ ఇంజినీర్ కె.ధనుంజయరావు, చీఫ్ ట్రాన్స్‌పోర్టు మేనేజర్ దిబ్యాంజన్ రాయ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


బొబ్బిలి రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న జనరల్ మేనేజరు పరమేశ్వర్

ఎస్పీకి బొబ్బిలి చరిత్ర, వీణ బహూకరణ


ఎస్పీకి బొబ్బిలి వీణతో పాటు, చరిత్ర పుస్తకాన్ని అందిస్తున్న ఎస్ఐ చదలవాడ

బొబ్బిలి: జిల్లాపోలీసు బాస్ అయిన ఎస్పీ దీపికాపాటిల్‌కు బొబ్బిలి ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ బొబ్బిలి చరిత్ర పుస్తకంతోపాటు, బొబ్బిలి వీణనను బహూకరించారు. ఎస్ఐ సత్యనారాయణ పోలీసు విధులను సక్రమంగా నిర్వహిస్తున్నందుకు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆయనకు ఎస్పి దీపికా పాటిల్ ప్రశంసాపత్రం అందించారు. అంతకన్నా ముందు చదలవాడ ఎస్పికి వీణతో పాటు బొబ్బిలి చరిత్ర పుస్తకాన్ని అందజేయడంతో ఆమె సంతోషించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

తారకనాథ్ సేవలు స్ఫూర్తిదాయకం

రామభద్రపురం, జూన్ 20: అఖిలభారత స్టేట్ బ్యాంకు ఉద్యోగుల సంఘ ముఖ్య నాయకులు దివంగత తారకనాథ్ బ్యాంకు ఉద్యోగుల పురోభివృద్ధికి ఎనలేని కృషి చేశారని ఎస్‌బీఐ స్థానిక బ్రాంచి మేనేజర్ బెలగాం హరీంద్ర అన్నారు. స్థానిక ఎస్‌బీఐ కార్యాలయంలో గురువారం తారకనాథ్ 20వ వర్థంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ బ్యాంకు ఉద్యోగి తారకనాథ్ బాటలో పనిచేసి సంఘ పటిష్టతకు కృషి చేయాలన్నారు. యూనియన్ నాయకులు హరికృష్ణ, అసిస్టెంట్ మేనేజర్ రమేష్, ఫీల్డ్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, బ్యాంకు సిబ్బంది శ్రావణి, ధర్మారావు, బీసీ పాయింట్ నిర్వాహకులు పీవీ.సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులపై ప్రేమ చూపాలి

కొత్తవలస, జూన్ 20 : దివ్యాంగుల పట్ల ప్రతి ఒక్కరూ ప్రేమగా వ్యవహరించాలని కొత్తవలస సీఐ చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని మంగళపాలెం గ్రామంలోని గురుదేవ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మూడు జిల్లాలకు చెందిన దివ్యాంగుల కోసం నిర్వహించిన యోగా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. ట్రస్టు నిర్వహణపై చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబును అభినందించారు. కార్యక్రమంలో యోగా శిక్షకుడు జేవీ ప్రసాదరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐ చంద్రశేఖర్

సాగునీటి వనరులను గాలికొదిలేశారు

బొబ్బిలి: బొబ్బిలి, బాడంగి, తెర్లాం, రామభద్రపురం మండలాల్లో అందుబాటులో ఉన్న సాగునీటి వనరుల నిర్వహణ, మరమ్మతు పనులను గత ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసిందని సీపీఎం, రైతు సంఘం నాయకులు ఆరోపించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు, రైతు సంఘ అధ్యక్షుడు ఎస్.గోపాలం మాట్లాడుతూ గత పాలకులపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పంట కాలువలు, చెరువులు, చెక్‌డ్యామ్‌లను పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. పారాది ఆనకట్ట పరిధిలో గల పిల్ల కాలువలు, వెంగళరాయ సాగర్, పెద్దగెడ్డ, కంచరగెడ్డ, తోటపల్లి కాలువలను నిర్వహించకుండా, మరమ్మతులు చేపట్టకుండా వదిలేయడంతో వర్షాలు కురిసేటప్పుడు నీరంతా సముద్రం పాలవుతోంది తప్ప పంట పొలాలకు ఉపయోగపడడం లేదన్నారు. నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతుల బాధలను స్వయంగా తెలుసుకున్నామని తెలిపారు. వేగావతి నదిపై ఇటీవల కాజ్‌వే కొట్టుకుపోవడానికి కారణం పంట కాలువల్లో పూడికలు తీయకపోవడమేనని వారు ఆరోపించారు. తెలుగుదేశం పాలకులు దీనిపై ప్రధానంగా దృష్టి సారించాలని కోరారు. ఈ సమావేశంలో రైతు నాయకులు ఉడమల భూషణం, రెడ్డి త్రినాథనాయుడు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

బొబ్బిలి, జూన్ 20: కోమటిపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీడీ జనార్ధనరావు గురువారం పరిశీలించారు. వేతనదారులతో మాట్లాడి వారి అభిప్రాయాలను అడిగితెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం ముందస్తు కొలతల ఆధారంగా పనులు చేపట్టాలన్నారు. ప్రతిరోజూ క్షేత్రసహాయకులు మస్తర్లను పరిశీలించాలన్నారు. నిర్ణీత లక్ష్యాల మేరకు ఉపాధి పనులను సక్రమంగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయన వెంట సాంకేతిక సహాయకుడు రామారావు ఉన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడికి అభినందన

శృంగవరపుకోట: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును విశాఖపట్టణంలో గురువారం శృంగవరపుకోట జనసేన నాయకుడు ఒబ్బిన సన్యాసినాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను అభినందించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ యోచన విరమణ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా రైతులకు సాగునీరు అందించేందుకు ప్రయత్నించాలని కోరారు. ఆయనతో మల్లువలస శ్రీను ఉన్నారు.


పల్లా శ్రీనివాసరావుకు అభినందనలు చెబుతున్న ఎస్.కోట జనసేన నాయకులు

మట్టి అక్రమ తవ్వకాలు చేపడితే చర్యలు

● ఆర్డీవో శాంతి



చెరువులను పరిశీలిస్తున్న ఆర్డీఓ శాంతి

రాజాం: అక్రమ మట్టి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకోవా లని చీపురు పల్లి ఆర్డీవో బి శాంతి అధికారు లను ఆదేశించారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి జిల్లా కలెక్టర్ స్పందించి కచ్చిత మైన ఆదేశాలు జారీచేయడంతో ఆమె స్పందించారు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బుధవారం మట్టి కొల్ల గొట్టి అనే కథనానికి స్పందించిన ఆర్డీవో శాంతా మాట్లాడుతూ ఇరిగేషన్ వీఆర్‌ఓలు. మైనింగ్, ఎస్ఈబీ అధికారులు మట్టి తవ్వకాలు విషయంలో నిర్లక్ష్యం వహించొద్దని, మైనింగ్ అధికారులు అనుమతులు లేకుండా తవ్వకాలు చేస్తే చర్యలు తీసుకొని వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. కొత్తవలస. బొద్దాం గ్రామాల్లో మట్టి తవ్వకాలను స్వయంగా పరిశీలించారు. అవసరమైతే అక్రమంగా తవ్వకాలు చేపడితే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈయనతో పాటు డీటీ వెంకటేష్, వీఆర్‌ఓలు ఉన్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు

గరుగుబిల్లి: మండలంలో నేరాలను అదుపులోకి తీసుకొచ్చేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని ఎస్ఐ వై.అమ్మన్నరావు తెలిపారు. ఖడ్గవలస సముదాయంలో బుధవారం రాత్రి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి సమయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు నేరాలకు పాల్పడేందుకు చూస్తున్నారని, ఈ మేరకు ముమ్మరంగా వాహన తనిఖీలు చేస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరించినట్లయితే పోలీస్ సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. గతంలో ఖడ్గవలస ప్రాంతంలో దొంగతనాలు జరగడంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. గతంలో జరిగిన సంఘటనల్లో రికవరీలు చేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

విద్యుత్ లోడ్ పేరుతో కేసులు

లక్కవరపుకోట: విద్యుత్ లోడు పెంచుకోవాలని... తక్కువ లోడుపై ఎక్కువ వాడుతున్నారని చెబుతూ విద్యుత్ శాఖ సిబ్బంది ఎడాపెడా అపరాధ రుసుం విధిస్తుండడంతో సిబ్బందితో ప్రజలు గొడవకు దిగుతున్నారు. చంద్రబాబు వచ్చాకే లోడు పేరుతో కేసులు రాయడమేంటని కొంతమంది అధికారులపై మండిపడ్డారు. గురువారం మండలంలోని కల్లేపల్లి గ్రామంలో విద్యుత్ శాఖాధికారులు ఇంటింటికి తిరిగి లోడు చెకింగ్ చేసి పేపర్లపై సంతకాలు చేయించుకున్నారు. ఈ రకంగా వినియోగదారునికి లోడు పేరుతో కనీసం రూ.1800 నుంచి రూ.4 వేల వరకు వడ్డన ఉండొచ్చు. ఇది చంద్రబాబు నాయుడు ప్రభుత్వ పనేనని ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళుతున్నాయి. ఎన్నికల ముందు తనిఖీ చేయాల్సి ఉండగా అప్పటి ఎమ్మెల్యేలు స్థానిక సిబ్బందిపై ఒత్తిడి తెచ్చి నిలుపుదల చేశారు. దీంతో అధికారులు ఇప్పుడు మొదలు పెట్టారు. ముందస్తు సమాచారం లేకుండా అపరాధ రుసుం విధించడం పద్ధతి కాదని వైద్యులు టి.నరసింహమూర్తి, కె.రమణ, కోన ఈశ్వరరావులు మండిపడ్డారు. దీనిపై విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ పెంటయ్య, లైన్‌మెన్ రమణలను వివరణ కోరగా అది నిరంతర ప్రక్రియ అని తెలిపారు.


కల్లెపల్లిలో లోడ్ చెక్‌చేస్తున్న విద్యుత్ అధికారులు

నేనున్నాను.. భయపడకండి

● పదో వార్డు దళితవాడ ప్రజలకు ఎమ్మెల్యే విజయచంద్ర భరోసా



చినమాదిగ వీధి ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురంటౌన్: 'గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం.. కానీ గతం గతః.. నేనున్నాను.. మీరు భయపడకండి' అంటూ పదో వార్డు ప్రజలకు పార్వతీపురం నియోజకవర్గ ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర హామీ ఇచ్చారు. పట్టణంలోని పదో వార్డులోగల చినమాదిగ, పెద మాదిగ వీధుల్లో సమస్యలను చూసేందుకు ఆయన గురువారం వెళ్లారు. ఈసందర్భంగా ఆయా వీధుల ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. కాలువల్లో పూడికలు తీసేందుకు తక్కువ మంది పారిశుధ్య కార్మికులు రావడం వల్ల ఎక్కడ మురుగు అక్కడే నిలిచిపోతుందని, వర్షాకాలంలో ఇళ్లలోకి మురుగు, వరద నీరు చొచ్చుకు పోతుందని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఐదు రోజులకొకసారి తాగునీటి సరఫరా వల్ల బోరునీరే గతి అవుతుందని ఆయా వీధుల ప్రజలు మొరపెట్టుకున్నారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ కాలువల్లో పూడికలు యుద్ధ ప్రాతిపదిక తీయడంతో పాటు వర్షాకాలం వచ్చేలోగా తీయించాలని ప్రజారోగ్యశాఖ ఇన్‌స్పెక్టర్ మురళీకి ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు కూడా కాలువల్లో వ్యర్థాలు వేస్తే జరిమానాలు విధించాలన్నారు. టీడీపీ నాయకుడు బి.సీతారామ్, తదితరులు పాల్గొన్నారు.

చెరువులను కాపాడుకుందాం

పార్వతీపురంటౌన్: పట్టణంలో ఆక్రమణకు గురైన చెరువులు, బందలు, గెడ్డలను కాపాడుకుందామని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. ఆక్రమణకు గురవుతున్న దేవుని బంద, బిల్ల బందలను ఆయన గురువారం పరిశీలించారు. వివేకానంద కాలనీలోగల దేవుని బందకు సంబంధించి సర్వే నెంబరు 343, సౌందర్య నారాయణమూర్తి నగర్‌లోగల బిల్ల బందకు సంబంధించి 25, 26, 27 సర్వే నెంబర్ల పరిధిలో ఆక్రమణల విషయమై రెవెన్యూ, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు సమగ్ర సమాచారాన్ని ఇవ్వాలని.. అక్రమార్కులపై చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆక్రమణలకు సంబంధించి అధికారులు చోద్యం చూస్తే ఇంటికి వెళ్లిపోవాల్సిందేనని హెచ్చరించారు.

హెచ్చరికలు జారీ చేసిన రెండు గంటల్లోనే..

పార్వతీపురంటౌన్: పట్టణంలో ఆక్రమణల తొలగింపుపై స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర హెచ్చరించిన రెండు గంటల్లోనే రెవెన్యూ, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, పోలీసులు రంగంలోకి దిగారు. చెరువు గట్లపై ఉన్న అనధికార నిర్మాణాలు, బందల్లో ఉన్న అనధికార లే అవుట్లలో వేసిన స్తంభాలను తొలగించారు. సౌందర్య నారాయణ మూర్తి నగర్ సమీపంలోని దేవుని బంద సర్వే నంబరులో అక్రమంగా నిర్మించిన కట్టడాలను కూల్చివేశారు. ఈ విషయమై పట్టణ ప్రణాళిక విభాగం అధికారి కనకారావును వివరణ కోరగా పట్టణంలోని చెరువు, బందలు, గెడ్డలు ఆక్రమించి కట్టడాలు నిర్మిస్తే కూల్చి వేస్తామని.. సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న దృశ్యం

లోఓల్టేజ్ సమస్యపై ఎమ్మెల్యేకు వినతి

పార్వతీపురం రూరల్: నర్సిపురం గ్రామంలో లోఓల్టేజ్‌తో పాటు విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యే విజయచంద్రకు టీడీపీ సీనియర్ నాయకుడు గొట్టాపు వెంకటరమణ తెలియజేసి, పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ట్రాన్స్‌కో డీఈకు సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నియోజకవర్గం పరిధిలో ఏ ప్రాంతంలో కూడా విద్యు త్ వినియోగదారులకు ఎటువంటి సమస్య వచ్చినా వెంటే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని విజయచంద్ర డీఈకు సూచించారు. ● పార్వతీపురం ఎమ్మెల్యే విజయ్‌చంద్రకు గురువారం పలువురు వైద్యులు అభినందించారు. వైద్యుడు సంజీవనాయుడు, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఏజెన్సీలో పనిచేయని బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్

గుమ్మలక్ష్మీపురం: మారుమూల గిరిజన ప్రజలకు సెల్‌ఫోన్ సౌకర్యం కల్పించాలన్న ఉద్దేశ్యంతో గుమ్మలక్ష్మీపురం గిరిజన ప్రాంతంలో సెల్‌ఫోన్ టవర్లను ఏర్పాటు చేశారు. వీటిలో కొన్ని టవర్లు పనిచేయక ఆయా ప్రాంత గిరిజన ప్రజలకు నెట్‌వర్క్ సదుపాయం లేదు. గుమ్మలక్ష్మీపురం మండలం తాటశీల బీఎస్ఎన్ఎల్ టవర్ పనిచేయడం లేదని, ఈ కారణంగా సెల్‌ఫోన్ సిగ్నల్స్ రావడం లేదని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రవీణ్ ప్రకాష్‌ను జీఏడీకి రిపోర్టు చేయడంపై హర్షం

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌ను విద్యాశాఖ నుంచి తప్పించి జీఏడీకి రిపోర్టు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్టు పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అమరపు సూర్య నారాయణ తెలిపారు. ఈసందర్భంగా ఆయన గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ప్రవీణ్ ప్రకాష్ విధానాల వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఆంగ్ల మాధ్యమం అంటూ రెండు భాషల్లో పాఠ్య పుస్తకం ముద్రించి ఇవ్వడం వల్ల ఏ మాధ్యమం నేర్చుకోలేక తికమకకు గురి చేశారని అన్నారు. ఆయన పర్యటనలో ఉపాధ్యా యులను హింసించారని, చాలా మంది అనారోగ్యం పాలయ్యారన్నారు. తానే నిజాయితీ పరుడిలా, మిగిలిన వారు కాదని లెక్కన చూశారన్నారు. విద్యాశాఖకు పట్టిన శని వదిలిందని ఆనందం వ్యక్తం చేశారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం శ్రీఅనగాదేవి సహిత జైగురుదత్త హోమాలు నిర్వహించారు. ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న భక్తులు

విపత్తులపై సమావేశం

ఒడిశా

రాయగడ: వరదలు, తుఫాన్లు వంటి ప్రకృతి విపత్తులను ఎలా ఎదుర్కొవాలి అనే అంశంపై గురువారం స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో కలెక్టర్ ప్రమోద్‌సత్యవాన్ మహాజన్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నదీపరీ వాహక ప్రాంతాలను గుర్తించాలని, ముందుగా ఆయా ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలోని కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తొలగించి మురుగునీరు ప్రవహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. శతశాతం కాలువల్లో పూడిక తీసి 15 రోజుల్లో నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో వచ్చే వరదల నుంచి రక్షణ కోసం గ్రామీణులను చైతన్య పరచాలన్నారు ఎలాంటి పరిస్థితినైనా ఎదు ర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. మందులు, కొవ్వొత్తులు, టార్పాలిన్లు అగ్గిపెట్టెలు వంటి అత్యవసర సామగ్రిని సిద్ధం చేసుకోవాలని సూచించారు. బీడీవోలు దిగువ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలన్నారు. జడ్పీ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, అదనపు కలెక్టర్ భాస్కరచంద్ర రౌయిత్, 11 సమితిలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రమోద్, ఇతర అధికారులు

'ఒట్టిగెడ్డ'లోకి మురుగు

● కలుషితం అవుతున్న తాగునీరు

● ఇబ్బందులు ఎదుర్కొంటున్న వీరఘట్టం వాసులు

వీరఘట్టం: మండలంలోని వీరఘట్టం పంచాయతీ ప్రజల తాగునీటికి ఒట్టిగెడ్డే ఆధారం.. కానీ ఈ గెడ్డలో నీరు కలుషితమయంగా మారుతోంది. వీరఘట్టం పంచాయతీ 14,135 జనాభా కలిగి ఉండగా, సుమారు 3,586 కుటుంబాలు ఉన్నాయి. వీరికి ఒట్టిగెడ్డే ప్రధాన తాగునీటి వనరు. గెడ్డ మధ్యలో ఇన్‌ఫిల్టర్ బావి ఏర్పాటుచేసి, దాని నుంచి గ్రామంలోని రక్షిత తాగునీటి పథకానికి తాగునీరు సరఫరా అవుతుంది. అయితే ఈ ఒట్టిగెడ్డలో దోభీఘాట్ లేకపోవడంతో రజకులు ఇందులోనే బట్టలు ఉతుకుతున్నారు. గ్రామంలో సుమారు 20 వీధుల నుంచి మురుగునీరు ఒట్టిగెడ్డలోనే కలుస్తుంది. దీంతో గెడ్డలోని నీరు పూర్తిగా కలుషితంగా మారుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీరు గెడ్డలో కలవకుండా చూడా లని, రజకులకు దోబీఘాట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారులను సంప్రదిస్తాం

ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ప్రవల్లిక వద్ద సంప్రదించగా ప్రజలకు అందించే తాగునీటికి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఒట్టిగెడ్డలోకి కలుషిత నీరు చేరకుండా ఉన్నతాధికారులను సంప్రదించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



వీధుల్లో నుంచి వచ్చిన మురుగునీరు ఒట్టిగెడ్డలో కలుస్తున్న దృశ్యం

మున్సిపల్ కమిషనర్‌పై మంత్రి ఆగ్రహం



కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి

సాలూరు: 'రాష్ట్ర మంత్రి అంటే మీకు అంత చులకనా.. ఫోన్ చేసినా పట్టించుకోరా.. మున్సిపాలిటీలో ఉన్న సాముహిక మరుగుదొడ్లు వినియోగంలోకి తీసుకురావాలని చెప్పి ఐదు రోజులు కావస్తున్నా ఎందుకు పనులు చేయటం లేద'ని కమిషనర్ తీరుపై మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సిబ్బందితో పాటు అధికారులతో ఆమె సమావేశమయ్యారు. విద్యార్థినుల కోరిక మేరకు ఇక్కడ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని అప్పట్లో హామీ ఇచ్చానని చెప్పారు. అందుకుగాను సమావేశం నిర్వహించటం తోపాటు స్థలాన్ని పరిశీలించామన్నారు. పాఠశాలలో ఎక్కడపడితే అక్కడే చెత్తలు పేరుకుపోయి ఉండటంతో మున్సిపల్ కమిషనర్ ప్రసన్నవాణికి ఆమె ఫోన్ చేశారు. ఆమె ఫోన్‌లో అందుబాటులోకి రాకపోవటంతో మంత్రి స్వయంగా మున్సిపల్ కార్యాలయానికి వెళ్లారు. ఉదయం 10:45 అయినప్పటికీ మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో లేకపోవటంతో కార్యాలయంలోకి వెళ్లి సిబ్బంది వచ్చారా లేదా.. అని చూశారు. అక్కడక్కడ కుర్చీలు ఖాళీగా ఉండడాన్ని చూశారు. వెనుదిరుగుతుండగా, ఇంతలో కమిషనర్ ప్రసన్నవాణి వచ్చి ఆమెను కలిశారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి మున్సిపాలిటీలో పర్యటన చేస్తున్నప్పుడు మున్సిపల్ సిబ్బంది వెంట ఎందుకు రావటం లేదని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులు అంటే అస్సలు స్పందించరా అని ప్రశ్నించారు. కనీసం ఫోన్ కూడా ఎందుకు ఎత్తటం లేదని అడిగారు. మున్సిపాలిటీలో ఉన్న సామూహిక మరుగుదొడ్లను తక్షణం మరమ్మతులు చేయాలని ఐదు రోజులు కిందట ఆదేశించినప్పటికీ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ టెండర్లు పిలుస్తామని తెలిపారు. దీనిపై మంత్రి స్పందించి.. అత్యవసర పనులకు టెండర్లు ఎందుకని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వచ్చినా మరుగుదొడ్లకు మరమ్మత్తులు చేయరా..? అప్పుడు కూడా ఇలానే టెండర్లు పిలుస్తామని చెబుతారా.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సక్రమంగా విధులు నిర్వహించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. త్వరితగతిన సాముహిక మరుగుదొడ్లు మరమ్మతులు చేయకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు సమయ పాలన పాటించాలని ఆదేశించారు. ఆమె వెంట డిప్యూటీ డీఈవో రాజ్‌కుమార్, పట్టణ నాయకులు నిమ్మాది తిరుపతిరావు, కేతిరెడ్డి చంద్రశేఖర్, కౌన్సిలర్లు వైదేహి, లక్ష్మీజీ, హర్ష తదితరులు పాల్గొన్నారు.

జ్వర నిర్ధారణ పరీక్షలు చేయాలి

కొమరాడ: గ్రామాల్లో జ్వర లక్షణాలు ఉన్న ప్రతిఒక్కరికీ సత్వరమే క్షేత్ర స్థాయిలో నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని జిల్లా మలేరియా అధికారి డా.టి.జగన్మోహన్‌రావు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని చినఖేర్జిల గ్రామాన్ని ఆయన గురువారం సందర్శించి, వైద్య శిబిరాన్ని పరిశీలించారు. జ్వర లక్షణాలతో ఉన్న వారికి నిర్వహించిన మలేరియా ఆర్డీటీ నిర్ధారణ పరీక్షలు, ఫలితాలను పరిశీలించారు. జ్వర లక్షణాలు ఉన్నవారికి, తగు మందులు అందజేయాలని సూచించారు. ప్రస్తుతం సీజనల్ జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ విజయకుమారి, సూపర్‌వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది అనిల్, మంగమ్మ, రమేష్, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంవో

వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి

గరుగుబిల్లి: పంచాయతీల పరిధిలో వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల పంచాయతీ విస్తరణాధికారి ఎల్.గోపాలరావు సూచించారు. మండలంలోని పెదగుడబ, చినగుడబ, రాయిందొరవలస, ఉద్దవోలు పంచాయతీల్లో పరిసరాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షా కాలం దృష్ట్యా తాగునీరు కలుషితం కాకుండా క్లోరినేషన్ చర్యలు చేపట్టాలన్నారు. అలాగే మురుగు నిల్వలు తొలగించాలని, దోమలు విజృంభించకుండా పిచికారీ చేయాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణపై అలసత్వం వహించే వారిపై చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ఎం.దుర్గాప్రసాద్, వెంకటనాయుడుతో పాటు కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, గిరిజన సంక్షేమ ఆశ్రమ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు సంబంధిత గ్రామ సచివాలయాల ఏఎన్ఎంలు హిమోగ్లోబిన్ రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు గురువారం స్థానిక చింతలగూడ వీధిలో ఉన్న ఎయిడెడ్ ఎలిమెంటరీ పాఠశాల లో విద్యార్థులకు హిమోగ్లోబిన్ రక్త పరీక్షలు నిర్వహించినట్టు సచివాలయ ఏఎన్ ఎం అలైఖ్య తెలిపారు. విద్యార్థులకు రక్తహీనత ఉంటే ఐరెన్ టాబ్లెట్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌డబ్ల్యూవో భారతి, పాఠశాల హెచ్ఎంలు కుమారస్వామి, వలంటీర్లు, సునీత, ప్రశాంతి ఉన్నారు.



హిమోగ్లోబిన్ పరీక్షలు చేస్తున్న దృశ్యం

ప్లాస్టిక్ రహిత పాలకొండే లక్ష్యం

పాలకొండ: కిరాణా, కూరగాయలు తదితర దుకాణాల్లో పాలిథిన్ కవర్లు వాడితే చర్యలు తప్పవని నగర పంచాయతీ కమిషనర్ సామంచి సర్వేశ్వరరావు హెచ్చరించారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో దుకాణాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. పాలిథిన్ కవర్లు కలిగిన ఓ దుకాణాన్ని సీజ్ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత పాలకొండకు అందరూ సహకరించాలన్నారు. మార్కెట్‌కు వచ్చిన ప్రతి ఒక్కరూ విధిగా చేతి సంచిని తీసుకొని రావాలన్నారు. అనంతరం వీధుల్లో శానిటేషన్ పనులను పరిశీలించారు.



దుకాణాలను తనిఖీ చేస్తున్న కమిషనర్

ప్రమాదాల నివారణకు చర్యలు

పార్వతీపురంటౌన్: రహదారి భద్రత కార్యక్రమాల్లో భాగంగా ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పట్టణ ఎస్ఐ రవీంద్రరాజు, ఎంవీఐ రమేష్‌లు తెలిపారు. గురువారం పట్టణంలోని రాయగడ రోడ్డు శివారు నుంచి వెంకంపేట గోలీల వరకు, అక్కడి నుంచి బైపాస్ రహదారిలోని ప్రమాదాలు జరుగుతున్న కూడళ్ల, ప్రాంతాలను గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదాల నివారణలో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాలను ఆర్‌అండ్‌బీ అధికారులతో సంయుక్తంగా పరిశీలించామన్నారు. వాహన చోదకులు రహదారి భద్రతా నియమాలు పాటించాలని కోరారు.

లోకేష్ దృష్టికి సవరభాషా వలంటీర్ల సమస్య

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న సవర భాషా వలంటీర్ల సమస్యను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తానని నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి పడాల భూదేవి స్పష్టం చేశారు. గురువారం తన కార్యాలయంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను భాషా వలంటీర్లు పడాల భూదేవికి విన్నవించారు. వైసీపీ ప్రభుత్వం తమను విధుల నుంచి తొలగించిందన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి రెన్యూవల్ చేసి కొనసాగించాలని వినతిపత్రం ఇచ్చి కోరారు. ఆమె మాట్లా డుతూ ఈ విద్యా సంవత్సరం సవరభాషా వలంటీర్లకు రెన్యూవల్ చేసి గౌరవవేతనం పెంచేదుకు చర్యలు చేపడ తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సవర ఆనందరావు, సవర దొంబు, ఆరిక నాగభూషణ్, ఎ.రాణి, వి.లక్ష్మి, వి.సుహాసిని, పి.సుందరరావు, బి.శివ, ఎ.బసవ రాజు, సవర కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలరావుకు అభినందనలు

పాలకొండ: ఏపీఎస్ ఆర్టీసీ ఎండీగా పదవీ బాధ్యతలు నిర్వహించిన ద్వారకా తిరుమలరావును ఆంధ్రప్రదేశ్ డీజీపీగా ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ విజయనగరం జోనల్ కార్యదర్శి భాసూరు కృష్ణమూర్తి, నాయకులు శుభాకర్, పద్మ, తాతాలు, రమణ, రాజు, కన్నయ్య, జనార్దన, నారాయణ, రాము అభినందనలు తెలిపారు. తిరుమలరావు ఆర్టీసీ ఎండీగా పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఉద్యోగుల సంక్షేమం కోసమే ఆలోచించారన్నారు. ఆయనను డీజీపీగా నియమించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.



తిరుమలరావును సన్మానిస్తున్న దృశ్యం

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి

పాలకొండ: ఈనెల 29న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని పాలకొండ జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ ఎ.రాజ్‌కుమార్ న్యాయవాదులకు పిలుపునిచ్చారు. గురువారం కోర్టు హాల్‌లో ప్రీ లోక్‌అదాలత్ నిర్వహించారు. అందులో రాజీమార్గంలో ఒక కేసును పరిష్కరించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.సత్యనారాయణ, సీమల కృష్ణారావు, ఏటీపీ గోవిందరావు, జి.సత్యంనాయుడు, ఎం.జగన్మోహన్ రావు, బలగ బుజ్జి, ఎం.వెంకటేశ్వరరావు, చందక జగదీశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయరాజ్‌కుమార్

ఎన్ఎంయూ అసోసియేషన్‌కు సభ్యత్వం

పాలకొండ: పాలకొండ డిపోలో వైఎస్సార్ అసోసియేషన్ నుంచి డిపో అధ్యక్షుడు ఎస్.టి.రావు ఆధ్వర్యంలో సుమారు 60 మంది సభ్యులు గురువారం ఎన్ఎంయూ సభ్యత్వం తీసుకున్నారు. వారికి డిపో కార్యదర్శి వి.రాజేష్ స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బారావు, వైకుంఠం, పి.ఎల్.రావు, సంగమేష్, ఎస్‌టీ రావు, జి.నాయుడు, మూర్తి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు విధులు నిర్వహించాలి

గరుగుబిల్లి: ఉపాధి హామీ పథకం పనుల పరిశీలనకు నియమించిన సామాజిక తనిఖీ బృంద సభ్యులు నిబంధనల మేరకు విధులు నిర్వహించాలని ఎంపీడీవో పైల సూర్యనారాయణ సూచించారు. గురువారం స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో సామాజిక సిబ్బంది, ఉపాధి సిబ్బందితో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 25 పంచాయతీల్లో గత ఏడాది సుమారు రూ.20కోట్లకు పనులు నిర్వహించారని చెప్పారు. ఈ పనుల పరిశీలనకు ఉన్నతాధికారులు అవసరమైన సిబ్బందిని నియమించారన్నారు. మండలంలో 2023 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి నెలాంతం వరకు నిర్వహించిన పనులు పరిశీలనకు ఎస్ఆర్‌పీతో పాటు ఏడుగురు డీఆర్‌పీలను నియమించారని తెలిపారు. 17వ విడత తనిఖీలకు ఏడు బృందాలను నియమించారని వివరించారు. ఉపాధి ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు సిబ్బందికి అవసరమైన రికార్డులను అందించాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో పర్యటించే సమయంలో సిబ్బందికి సహకరించాలన్నారు. సామాజిక సిబ్బంది ప్రలోభాలకు గురికాకుండా ఉండేలా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏపీఎం ఎం.గౌరీనాథ్ మాట్లాడుతూ సిబ్బందికి అవసరమయ్యే రికార్డులను అందుబాటులో ఉంచామని చెప్పారు. ఉపాధికి సంబంధించి వేతనదారులకు వేతనం రూపంలో రూ.15.75 కోట్లు,మెటీరియల్ కు రూ.4.37కోట్లు ఖర్చయ్యిందని వివరించారు. పనులు నిర్వహించే సమయంలో విధులు నిర్వహించే ఉపాధి సిబ్బంది, తనిఖీల సమయంలో హాజరుకావాలన్నారు. ఉపాధి పనులతో పాటు పింఛన్ల పరిశీలన ఉంటుందని తెలిపారు. ఎస్ఆర్‌పీ బి.దాసు, డీఆర్‌పీలు బి.శివ, శ్రీనివాసరావు, వరహారావు, ఎం.నారాయణమూర్తి, కంప్యూటర్ ఆపరేటర్ టి.తిరుపతిరావు, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.



ఉపాధి సిబ్బంది, సామాజిక బృందానికి సూచనలిస్తున్న ఎంపీడీవో

క్లుప్తంగా..

విద్యుత్ నిలుపుదల

భామిని: గురండి సబ్‌స్టేషన్ పరిధిలోగల సింగిడి ఫీడర్‌లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేసినట్టు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు 11 కేవీ లైన్లకు జంగిల్ క్లియరెన్స్‌తో పాటు పలు చోట్ల మరమ్మతులు చేపడతామని చెప్పారు. దీనితో సింగిడి, నులకజోడు, బిల్లుమడ గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కూటమి విజయోత్సవ ర్యాలీ

వీరఘట్టం: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి రాష్ట్రంలో విజయం సాధించడంతో పాటు నియోజకవర్గంలో నిమ్మక జయకృష్ణ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో విక్రంపురంలో గురువారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మాచర్ల అనీల్‌బాబు, నందికేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భజన పోటీలు ముగింపు

సీతానగరం: మండలంలోని లక్ష్మీపురంలో మూడు రోజుల పాటు నిర్వహించిన తాళం భజన పోటీలు గురువారం ముగించారు. ఈసందర్భంగా నిర్వాహకులు వెంకటరమణ, సింహాచలం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీల్లో ఆరు మండలాలకు చెందిన 33 భజన బృందాలు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో ప్రథమస్థానంలో గూవల్లి, ద్వితీయ స్థానంలో లక్ష్మీపురం, తృతీయ స్థానంలో శివరాంపురం బృందాలు నిలవగా, వారికి బహుమతులు అందజేశారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు

మక్కువ: ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ పి.నరసింహామూర్తి అన్నారు. స్థానిక మార్కెట్ జంక్షన్‌ను ఆయన గురువారం పరిశీలించారు. రోడ్లపై విక్రయాలు చేపట్టడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందన్నారు. సాయంత్రం సమయంలో రద్దీ ఉన్నందున విక్రయదారులు నిబంధనలు పాటించి సహకరించాలని ఆయన కోరారు.

మతిస్థిమితం లేని వ్యక్తికి విశాఖ తరలింపు

భామిని: మండలంలోని సతివాడ సమీపంలో కొన్ని నెలలుగా ఆరుబయటే సంచరిస్తున్న మతిస్థిమితం లేని వ్యక్తిని ఇన్‌చార్జి ఎస్ఐ బి.అనీల్ ఆధ్వర్యంలో మానసిక వైద్య చికిత్స కోసం బుధవారం విశాఖ తరలించారు. ఉన్నతాధికారులు, కోర్టు ఆదేశాల మేరకు ఆ వ్యక్తికి చికిత్స అందించనున్నట్టు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థి కిట్లు వినియోగించుకోండి




విద్యార్థులకు కిట్లు అందిస్తున్న దృశ్యం

సీతంపేట: విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న కిట్‌ను వినియోగించుకోవాలని ఐటీడీఏ ఉప విద్యాశాఖాధికారి పాల నారాయుడు స్పష్టం చేశారు. మల్లి గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆయన గురువారం విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎంలు ఎంవీ శ్రీనివాసరావు, డిప్యూటీ వార్డెన్ వీరేసు పాల్గొన్నారు.

పవన్‌ను కలిసిన యశస్వి

పాలకొండ: జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యద ర్శి విజయనగరం అసెంబ్లీ ఇన్‌చార్జి పాలవలస యశస్వి మర్యాద పూర్వకంగా గురువా రం కలిశారు. విజయవాడలోని పవన్ క్యాంప్ కార్యాలయం వద్ద ఆయ న్ని కలిసి, పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు.



పవన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న యశస్వి

నాదెండ్లను కలిసిన జన సైనికులు

వీరఘట్టం: నడుకూరు గ్రామానికి చెందిన జనసేన నాయకులు గురువారం మంగళగిరిలో జనసేన పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ఆహార పౌర సరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స పుండరీకం, గొడప మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి నాదెండ్ల మనోహర్‌తో జనసైనికులు